ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు

శనివారం 24 ఆగస్టు 2024



బనగానపల్లెలో అక్రమ లే-అవుట్ తొలగిస్తున్న కుడా, పంచాయతీ అధికారులు



అక్రమ వెంచర్లు అడ్డగోలు అమ్మకాలు..!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో అక్రమ వెంచర్లు అధికమవుతున్నాయి. రహదారుల వెంబడి ఖాళీ స్థలాల్లో అనధికార లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. సాధారణంగా వ్యవసాయ సాగు భూములను లేఔట్లుగా ఏర్పాటు చేయాలంటే ముందస్తుగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలి. ఆయా పంచాయతీలతో పాటు కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) అనుమతులు అనివార్యం. అయితే ఇవేవీ పట్టనట్లు విచ్చలవిడిగా అనధికార లేఅవుట్లు వేసి, అమాయకులకు ఈ భూములను అంటగడుతున్నారు. కర్నూలు నగరంతో పాటు, శివారు ప్రాంతాల్లో అక్రమ వెంచర్లు వేయడం.. అడ్డగోలుగా అమ్మకాలు జరపడం పరిపాటిగా మారింది.

ప్రధాన పట్టణాల్లో గుర్తించిన అక్రమ లే అవుట్లు	
పట్టణం	లే అవుట్లు
కర్నూలు	35
నంద్యాల	35
ఆదోని	11
ఎమ్మిగనూరు	32
ఆళ్లగడ్డ	12
ఆత్మకూరు	15
నందికొట్కూరు	21
గూడూరు	7
మొత్తం	168

- భారీగా అనధికార లే అవుట్లు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 230కి పైగా గుర్తింపు
- రాజకీయ అండతో నిబంధనలకు తూట్లు
- కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోనే 35కి పైగా
- వెంచర్లు వేసిన వారిలో బడా రియల్ ఎస్టేట్ వ్యాపారులు

కర్నూలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారులో అభివృద్ధి చెందుతున్న జొహరాపురం ప్రాంతంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒకరు 3.75 ఎకరాల్లో వెంచర్ వేశాడు. ఆ స్థిరాస్తి వ్యాపారిపై నమ్మకంతో ఉద్యోగులు, వ్యాపారులు ఇంటి స్థలాలు కొనుగోలు చేశారు. ఆ వెంచరుకు ఎలాంటి అనుమతులు లేవని, అది అక్రమ లే అవుట్ అని కుడా, కర్నూలు నగరపాలక సంస్థ అధికారులు గుర్తించారు. నోటీస్ జారీ చేశారు. కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 230కి పైగా అక్రమ వెంచర్లు గుర్తిస్తే.. కర్నూలు నగరంలో ఒక్కటే 35కిపైగా ఉన్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే వెంచర్లు వేసి ఇష్టారాజ్యంగా ప్లాట్లు అమ్మకాలు చేస్తున్నారు. నిబంధనలు తుంగలో తొక్కేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన రూ.కోట్లు ఆదాయానికి గండి కొడుతున్నారు. టౌన్ ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్లు విస్తీర్ణ తగ్గించి లే అవుట్లు వేస్తుండడంతో.. ఆ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైపులు, పార్కుల అభివృద్ధి.. వంటి మౌలిక వసతులు కల్పించడం మున్సిపాలిటీలకు కష్టంగా మారుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు సాగిస్తున్న అక్రమ లే అవుట్ల దందాపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్రమార్కులపై 'కుడా' అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా)ను ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్-2016 ప్రకారం 2016 నవంబరు 4న అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కర్నూలు నరగపాలక సంస్థ, నంద్యాల, డోన్ మున్సిపాలిటీలు, గూడూరు, బేతంచెర్ల నగర పంచాయతీలు సహా 9 మండలాల్లోని 123 గ్రామాలు 'కుడా' పరిధిలో చేర్చారు. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 14 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 53 మండలాలు ఉంటే.. కొత్తపల్లి, గడివేముల, అవుకు మండలాలు మినహా 50 మండలాలు కుడా పరిధిలోకి తెచ్చారు. పల్లె, పట్టణాలు క్రమపద్ధతిలో అభివృద్ధి చెందేలా పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్) అమలు, అక్రమ లే అవుట్లు నిరోధించడం కుడా ప్రధాన లక్ష్యం. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ బడా నాయకుల అండతో అడ్డంగా నిబంధనలు తుంగలో కలిపేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వెంచర్లు వేసి సొమ్ము చేసుకున్నారు.

ఓర్వకల్లు మండలంలో అక్రమ లే-అవుట్ తొలగిస్తున్న కుడా, కార్పొరేషన్ అధికారులు



ప్రభుత్వ ఖజానాకు గండి

వ్యవసాయ భూములు, పారిశ్రామిక ప్రాంతాల్లో వెంచర్లు వేయకూడదు. వ్యవసాయ, ప్రైవేటు భూముల్లో వెంచర్లు వేయాలంటే నిర్ణీత రుసుం చెల్లించి కన్వర్షన్ కోసం దరఖాస్తు చేయాలి. ఎన్‌ఓసీ తీసుకుని లే అవుట్లు అప్రూవల్ కోసం సంబంధిత గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలకు వాటి పరిధికి మించి విస్తీర్ణం ఉంటే 'కుడా'కు ఆన్‌లైన్ దరఖాస్తు చేయాలి. దరఖాస్తు రుసుం, పర్మిట్ ఫీజు, డెవలప్‌మెంట్ చార్జీ, గ్రీన్ ఫీజ్, డీపీఎంఎస్ యూజర్ చార్జీ, లేబర్ సెస్ కాంపోనెంట్-1,2 రుసుం చెల్లించాలి. పట్టణ ప్రణాళిక నిబంధనల ప్రకారం 10 శాతం పార్కు, ఇతర అవసరాలకు ఓపన్ సైట్ ఇవ్వాలి. 40 అడుగుల విస్తీర్ణంలో రోడ్డు వేయాలి. ఓపన్ సైట్, రోడ్లు కోసం 45 శాతానికిపైగా వదలాల్సి ఉంటుంది. వివిధ ఫీజుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టడమే కాకుండా 20, 25, 30 అడుగుల విస్తీర్ణం రోడ్లతో అక్రమ లే అవుట్లు వేస్తున్నారు. దీంతో కొనుగోలు చేసిన ఉద్యోగులు, చిరువ్యాపారులు, సామాన్య జనం నష్ట పోవాల్సి వస్తోంది. నాన్ లే అవుట్ ప్లాట్లలో ఇల్లు కట్టుకోవాలంటే అప్రూవల్ కోసం ఇబ్బందులు పడక తప్పదు. టౌన్ ప్లానింగ్ లే అవుట్లు ప్లానింగ్ (ఎల్‌పీ) అప్రూవల్ ప్లాట్లు కొనుగోలు చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఇటు ప్రభుత్వాన్ని.. అటు కొనుగోలుదారులను నిలువునా మోసం చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వెంచర్ల నిర్వాహకులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.



కుడా కార్యాలయం



ఎమ్మిగనూరు పట్టణం గుడికల్లు రోడ్‌లో అక్రమ లే-అవుట్‌ను తొలగిస్తున్న అధికారులు



ఉమ్మడి జిల్లాలో 230 అక్రమ లే అవుట్లు

గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యేలు, బడా రాజకీయ నాయకుల అండదండలతో విచ్చవిచ్చల విడిగా అక్రమ లే అవుట్లు పుట్టుకొచ్చాయి. ఒక వెంచర్ వేస్తే.. ఆ వెంచర్ విలువపై 5-10 శాతానికి పైగా అప్పటి అధికార పార్టీ నాయకులకు చెల్లించాల్సి వచ్చేదని రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒకరు వాపోయారు. కర్నూలు నగరం, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల, బనగానపల్లె, పాణ్యం, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు, డోన్ ప్రాంతాల్లో స్థిరాస్తి పేరిట 'రియల్' అవినీతి భాగోతం సాగిందని, ఒక్కో వెంచరుకు ఒక్కో రేటు చొప్పున వసులు చేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ ముఖ్య నాయకులు కొందరి ఆజ్ఞ లేనిదే సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు కూడా జరిగేవి కావు. వీటిని అరికట్టాల్సిన అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో అక్రమ లే అవుట్లపై దృష్టి సారించింది. అధికారుల్లో కదలిక వచ్చింది. క్షేత్రస్థాయిలో విచారణకు శ్రీకారం చుట్టారు. కర్నూలు జిల్లాలో 120, నంద్యాల జిల్లాలో 110 చొప్పున కుడా పరిధిలో 230 అక్రమ లే-అవుట్లు ఉన్నట్లు గుర్తించారు. వాటిపై దాడులు చేసి వెంచరు రాళ్లు, సరిహద్దు గోడలు తొలగించే చర్యలకు శ్రీకారం చుట్టారు.



అక్రమ లే అవుట్లపై కఠిన చర్యలు



ఉమ్మడి కర్నూలు జిల్లాలో మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో 230 అక్రమ లే అవుట్లు గుర్తించాం. యజమానులకు నోటీసులు కూడా జారీ చేశాం. చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వెంచర్లను తొలగిస్తాం. అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి నష్టపోవద్దని ప్రజలకు సూచిస్తున్నాం. ఇప్పటికే బనగానపల్లె, కర్నూలు, ఎమ్మిగనూరు పట్టణాల్లో పలు అక్రమ వెంచర్లను తొలగించాం.

- ప్రతాప్ సూర్యనాయణరెడ్డి, కుడా వైస్ చైర్మన్, కర్నూలు

కర్నూలు పరిధిలో 35 అక్రమ వెంచర్లు

- కర్నూలు నగరపాలక సంస్థలో అంతర్భాగంగా ఉన్న కల్లూరు మండలం కల్లూరు సర్వే నంబరు 680/ఏ2బీలో 2.5 ఎకరాల్లో వంశీ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు, 386/3లో 1.6 ఎకరాల్లో రాగమయూరి కమర్షియల్ స్ట్రీట్, సర్వే నంబరు 357లో 2.3 ఎకరాల్లో ఎరుకలి రాముడు, 1.7 ఎకరాల్లో వీరయ్య, కృష్ణమూర్తి జాయింట్ వెంచర్, సర్వే నంబర్లు 170 పార్ట్‌లో 6.1 ఎకరాల్లో వైష్ణవి లే-అవుట్, 171లో 3.59 ఎకరాల్లో వెంకటేశ్, లక్ష్మీపురం సర్వే నంబర్లు 774(పీ), 775(పీ),776(పీ) పరిధిలో 3.75 ఎకరాల్లో టీకే సింగ్, పందిపాడు సర్వే నంబర్లు 144, 157 (పార్ట్)లో 2.22 ఎకరాల్లో సాయి అంజనాద్రి నగర్, పెద్దపాడు గ్రామం పరిధిలో సర్వే నంబరు 38 (పార్ట్)లో 5.8 ఎకరాల్లో ప్రగతి లే-అవుట్, సర్వే నంబరు 98 (పార్టు)లో 1.8 ఎకరాల్లో మంజునాథ గ్రీన్‌వే కాలనీ, సర్వే నంబర్లు 115 (పార్టు), 128 (పార్టు), 136 (పార్టు)లో 16.3 ఎకరాల్లో శివసాయి నగర్‌లోని వెంచర్లను అధికారులు గుర్తించారు.
- కర్నూలు అర్బన్ మండలంలో మామిదాలపాడులో సర్వే నంబరు 34/2లో 4.59 ఎకరాల్లో ఎస్.వీరయ్య, సర్వే నంబర్లు 4-2,4-2ఏ,4-2బీ,4-2సీ,4-3లో 2.99 ఎకరాల్లో దామోదరం మోహన్, 204బీ/1ఏ2ఏ, 1ఏ2బీ, 205/1, 210బీలో 4.47 ఎకరాల్లో విజయనగర్ కాలనీ, 189/సీ2ఏ, 189/సీ2బీలో 2.98 ఎకరాల్లో నందనం నగర్, 171/2ఏ2ఎఫ్, 1ఏ1బీ, 2ఏ2బీ, 173/1ఏలో 1.62 ఎకరాల్లో శ్రీనిలయం, 171/2ఏ4(171/2ఏ2సీ)లో ఒక ఎకరాలో విజయకాలనీ, జోహరాపురంలో 165/2ఏలో 4.37 ఎకరాల్లో జేబీ బిల్డర్, సర్వే నంబరు 154/పార్ట్‌లో 4 ఎకరాల్లో బీఎస్ఆర్ కాలనీ, 3/సీలో 4 ఎకరాల్లో వెంకటేశ్వరరెడ్డి, 3/బీలో ఒక ఎకరాలో ఎస్.వలి, 7/బీలో ఒక ఎకరాలో ఎస్.మున్నా, సర్వే నంబరు 52లో 8 ఎకరాల్లో ఎస్. అస్లామ్, 3/సీలో ఒక ఎకరాలో వెంకటేశ్వరగౌడ్, 7/బీలో 3 ఎకరాల్లో ఎస్.అనీఫ్, సర్వే నంబరు 42లో ఒక ఎకరాలో పి. మోహన్, సర్వే నంబర్లు 31, 32లో ఒక ఎకరాలో శోభన్‌గౌడ్, సర్వే నంబరు 5లో 3.5 ఎకరాల్లో మల్లికార్జునగౌడ్, సర్వే నంబరు 1సీలో 3 ఎకరాల్లో జీలానీ హోమ్స్, సర్వే నంబరు 1బీలో 1.5 ఎకరాల్లో జబ్బార్ హోమ్స్ వెంచర్లు లిస్ట్‌లో ఉన్నాయి.
- కర్నూలు రూరల్ మండలంలో కర్నూలులో సర్వే నంబరు 6లో ఒక ఎకరాలో వికాస్ బిల్డర్, మునగాలపాడు సర్వే నంబరు 154లో 17 ఎకరాల్లో వెంకటస్వామి, సర్వే నంబరు 212, 213లో 2 ఎకరాల్లో శ్రీసాయి నగర్, సర్వే నంబరు 202లో 2.5 ఎకరాల్లో రాజరాజేశ్వరి వెంచర్లను అక్రమ లే అవుట్లుగా కార్పొరేషన్, కుడా అధికారులు గుర్తించి నోటీసులు జారీ చేశారు. వాటిపై చర్యలకు శ్రీకారం చుట్టబోతున్నారు.



మాట్లాడుతున్న ఎంపీ నాగరాజు, పక్కనే కలెక్టర్ రంజిత్ బాషా, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

స్వర్ణ పంచాయతీలకు శ్రీకారం

- ఒకే రోజు 484 పంచాయతీల్లో గ్రామ సభలు
- రూ.550 కోట్లకు పైగా విలువైన పనులకు తీర్మానాలు
- గార్గేయపురంలో ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే దస్తగిరి, కలెక్టర్ రంజిత్‌బాషా హాజరు

కర్నూలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సారథ్యంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పల్లెప్రగతికి ప్రాధాన్యమిస్తోంది. స్వర్ణ గ్రామ పంచాయతీ పేరిట గ్రామ సభలకు శ్రీకారం చుట్టింది. ప్రజలు తమ పల్లెలో ఎలాంటి పనులు చేపట్టాలో మెజార్టీ ప్రజల అభిప్రాయాల మేరకు తీర్మానం చేశారు. జిల్లాలో 484 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించి రికార్డు సృష్టించారు. పల్లెలో మెజార్టీ ప్రజలు కోరిక మేరకు తాగునీటి సరఫరా, సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం తదితర పనుల కోసం రూ.550 కోట్లకుపైగా విలువైన పనులకు తీర్మానాలు చేశారు. ప్రతి పంచాయతీ నుంచి రూ.50 లక్షలు రూ.2.50 కోట్లకు విలువైన పనులకు తీర్మానాలు చేస్తే.. పత్తికొండ వంటి మేజరు పంచాయతీల్లో రూ.16.50 కోట్లకు పైగా విలువైన 306 పనులకు గ్రామసభ ఆమోదం తెలిపింది.



పత్తికొండ పంచాయతీలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, పక్కనే ఉన్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం పంచాయతీలో సర్పంచ్ సోమేశ్వరమ్మ అధ్యక్షత జరిగిన గ్రామ సభకు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి, డీపీఓ నాగరాజు పాల్గొన్నారు. పత్తికొండ పంచాయతీలో జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి గోనేగండ్ల మండలం కున్నూరు గ్రామసభలో, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత కల్లూరు మండలం ఉల్లిందకొండ గ్రామ సభలో పాల్గొన్నారు. మంత్రాలయం టీడీపీ సీనియర్ నేత ఎన్.రాఘవేంద్రరెడ్డి కౌతాళం మండలం వల్లూరు గ్రామసభలో, ఆలూరు టీడీపీ సీనియర్ నేత బి.వీరభద్ర గౌడ్ ఆలూరు మండలం మణేకుర్తి గ్రామసభలో పాల్గొన్నారు. గార్గేయపురంలో జరిగిన సభలో ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ 2014-19 మధ్యలో రాష్ట్రంలో పల్లెపల్లెన 27,444 కి.మీల సీసీ రోడ్లు వేస్తే.. గత వైసీపీ ప్రభుత్వ ఆయాంలో ఐదేళ్లలో ఒక్క రోడ్డయినా వేసిందా? అని ప్రశ్నించారు. వైసీపీ పాలనకు, టీడీపీ పాలనకు ప్రజలు బేరీజు వేయాలని కోరారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలు కోరిన పనులపై తీర్మానాలు చేసి నిధులు రాగానే పనులు మొదలు పెడుతామన్నారు. పత్తికొండ గ్రామసభలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని వివరించారు. ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, గౌరు చరిత, కేఈ శ్యాంబాబులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేస్తే.. టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే పల్లె ప్రగతి పట్టాలెక్కించే ప్రక్రియకు గ్రామసభలు ద్వారా శ్రీకారం చుట్టామని వివరించారు.

జూనియర్ డాక్టర్ల సమ్మె విరమణ

సాధారణ వైద్యసేవలకు హాజరైన జూడాలు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 23: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనకు నిరసనగా 11 రోజుల నుంచి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మెను విరమించారు. శుక్రవారం ఉదయం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డిని ఏపీ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత్, సీనియర్ నాయకులు డాక్టర్ సుధీర్ కలిసి సమ్మెను విరమిస్తున్నట్లు వినతి పత్రాన్ని అందజేశారు. ఉదయం నుంచి సాధారణ వైద్యసేవలకు హాజరు కానున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూచనను పరిగణనలోకి తీసుకుని తాము వెంటనే విధుల్లో చేరుతున్నామని వెల్లడించారు. ఇన్ని రోజులుగా జూనియర్ డాక్టర్ల సమ్మెకు మద్దతు ఇచ్చిన వివిధ సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. డ్యూటీలో ఉన్న డాక్టర్లకు విశ్రాంతి గదులను నిర్మించాలని, హాస్టల్, హాస్పిటల్ పరిధిలో మొత్తం సీసీ, టీవీలు, లైట్లు తక్షణమే ఏర్పాటు చేసేలాగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జూడాల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ భార్గవ్, డాక్టర్ పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.



సమ్మెను విరమిస్తున్నట్లు సూపరింటెండెంట్‌కు పత్రాన్ని అందజేస్తున్న జూడాలు

ఉల్లి ధర పైపైకి

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 23: జిల్లాలో ఉల్లి పంట సాగు చేసిన రైతులు సంతోషంగా ఉన్నారు. గత సంవత్సరం ఇదే సమయానికి క్వింటం ఉల్లి కేవలం రూ.300 నుంచి రూ.400కు అమ్ముడుపోయింది. శుక్రవారం కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు 796 క్వింటాళ్ల ఉల్లిని అమ్మకానికి తెచ్చారు. గరిష్ఠ ధర రూ.3,934, మధ్యస్థ ధర రూ.3,587, కనిష్ఠ ధర రూ.1,237 ధర పలికిందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు, అదనపు సెక్రటరీ వెంకటేశ్వర్లు తెలిపారు. అదేవిదంగా వేరుశనగ కాయలు 874 క్వింటాళ్లు అమ్మకానికి రాగా, క్వింటా గరిష్ఠ ధర రూ.7,046, మధ్యస్థ ధర రూ.5,306, కనిష్ఠ ధర రూ.3,600 రైతుల చేతికి అందిందని సెక్రటరీ గోవిందు తెలిపారు. ఆముదాలు గరిష్ఠ ధర రూ.5,849, మధ్యస్థ ధర రూ.5,802, కనిష్ఠ ధర రూ.5,490 పలికిందన్నారు. వాము గరిష్ఠం రూ.15,812, మధ్యస్థం రూ.15,188, కనిష్ఠం రూ.11,440, కందుల ధర కాస్త తగ్గింది. గరిష్ఠ ధర రూ.9,319, కనిష్ఠంగా రూ.5,235 ధర పలికింది. మిరపకాయల ధర పూర్తిగా తగ్గిపోయింది. గరిష్ఠ ధర రూ.3,934, మధ్యస్థం రూ.3,659, కనిష్ఠం రూ.2,819లు రైతులకు అందిందని సెక్రటరీ తెలిపారు.



గ్రామసభలో అరుదైన ఘట్టం

సర్పంచ్‌గా తల్లి.. ఎమ్మెల్యేగా కొడుకు

రాజకీయ వేదికలపై కొన్నిసార్లు అరుదైన సంఘటనలు కనిపిస్తుంటాయి. సరిగ్గా అలాంటి ఒక సన్నివేశం కర్నూలు రూరల్ మండలంలోనూ చోటు చేసుకుంది. మండలంలోని పసుపుల గ్రామంలో శుక్రవారం గ్రామసభ జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ హోదాలో బొగ్గుల శీలమ్మ.. కోడుమూరు ఎమ్మెల్యే హోదాలో బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. గ్రామాభివృద్ధిలో భాగంగా అధికారిక కార్యక్రమంలో తల్లీ కొడుకులు ఇలా ఒకే వేదికను పంచుకుని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం ఆసక్తిగా మారింది. అనంతరం ఇద్దరూ కలసి గ్రామంలో మొక్కలను నాటారు.



- కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్

అశ్వవాహనంపై ప్రహ్లాదరాయలు

- వైభవంగా సుజ్ఞానేంద్రతీర్థుల ఆరాధన
- బంగారు పల్లకిలో రాఘవేంద్రుడు
- సంస్థాన పూజ చేసిన పీఠాధిపతి

మంత్రాలయం, ఆగస్టు 23: వేద పండితుల మంత్రోచ్చారణాలు, మంగళవాయిద్యాల మధ్య ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలు ఆశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాల్లో భాగంగా 6వ రోజు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు, అలంకరణ చేసి మహా మంగళహారతులు ఇచ్చారు. కర్ణాటకలోని నంజనగూడలో రాఘవేంద్రస్వామి శిష్యుడైన సుజ్ఞానేంద్రతీర్థుల బృందావనాన్ని పీఠాధిపతి ఆశీస్సులతో అక్కడి పండితులు ప్రత్యేక పూజలు చేసి, హారతులు ఇచ్చి శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అశ్వవాహనంపై మఠం ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించి చెక్క, వెండి, బంగారు, రజిత రథాలపై ఊరేగారు. ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాఘవేంద్ర బృందావన ప్రతిమను బంగారు పల్లకిలో ఊరేగించారు. సంస్థాన పూజల్లో భాగంగా పూర్ణబోధ పూజామందిరంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మూలరాములకు, జయరాములు, దిగ్విజయరాములకు బంగారు నాణేలతో అభిషేకించి హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పండిత కేసరి రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, మఠం దివాన్ సుజీంద్రాచార్, ఆనంద తీర్థాచార్, గౌతమాచార్, శ్రీమఠం ఉత్తర భారత విచారణకర్త శ్రీనివాస్ కన్నే, ఏఏవో మాధవశెట్టి పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఉత్సవాలు

రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాలు సర్వసమర్పణోత్సవంతో శనివారం ముగియనున్నాయి. పంచ రథాలపై ప్రహ్లాదరాయలను ఊరేగించనున్నారు.

ఆకట్టుకున్న భరతనాట్యం

ఉత్సవాల్లో ఆరో రోజైన శుక్రవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో చెన్నై కళాకారులచే భరతనాట్యం, బెంగుళూరు చెందిన హాసీకా హరిహరణ్ భరతనాట్యం, హుబ్లీకి చెందిన పండిత్ కృష్ణానేంద్ర వాడేకర్ హిందూస్థాని వోకల్ సంగీతం భక్తులను ఆకట్టుకున్నాయి.



వెండి వాహన సేవ



ఉత్సవాల్లో సమష్టిగా పని చేసిన వారికి అభినందనలు

రాఘవేంద్రస్వామి 353వ ఆరాధనోత్సవాలను విజయవంతం చేయడానికి సమష్టి కృషి చేసిన అధికారులకు మఠం ఏఏవో మాధవ శెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషీ అభినందనలు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నీ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఆంధ్ర, కర్ణాటక మీడియా మిత్రులు, శ్రీమఠంలోని అన్ని శాఖల అధికారులకు పీఠాధిపతి ఆశీస్సులు అందించారని తెలిపారు.



అశ్వవాహనం పై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు



విలువైన వజ్రం లభ్యం

తుగ్గలి, ఆగస్టు 23: వ్యవసాయ కూలీకి విలువైన వజ్రం లభ్యమైంది. శుక్రవారం మండలంలోని జొన్నగిరిలో పొలం పనులు చేసుకుంటున్న ఓ వ్యవసాయ కూలీకి వజ్రం లభ్యమైంది. ఆ వజ్రాన్ని స్థానిక వజ్రాల వ్యాపారి రూ.12 లక్షలు, 5 తులాల బంగారు ఇచ్చి కొనుగోలు చేసినట్లు సమాచారం.

ఉర్దూ వర్సిటీలో బీఏకు దరఖాస్తులు

కర్నూలు(అర్బన్), ఆగస్టు 23: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో బీఏ ఆనర్స్ కోర్సును ఈ ఏడాది ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని రిజిస్ట్రారు ప్రొఫెసర్ వి. లోకనాథ్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 25 లోగా డిగ్రీ ప్రవేశాలకు వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని తెలిపారు. వర్సిటీలో బీఏ ఎకనామిక్స్ ఆనర్స్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్ ఆనర్స్, బీఎస్సీ కంప్యూటర్ఆనర్స్ కోర్సుల్లో విద్యార్థులు చేరవచ్చు అన్నారు. ఉర్దూ ఇంటర్మీడియట్, మదరస బోర్డు ద్వారా ఇంటర్ పూర్తి చేసిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఈనెల 29న విద్యార్థులకు సీట్ల కేటాయింపు, 30 నుంచి వచ్చే నెల 3 లోగా విద్యార్థులు కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని, ఆదే రోజు నుండి కళాశాల తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

పోస్టల్ శాఖలో ఫిలాటలీ స్కాలర్ షిప్ పరీక్ష

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 23: పోస్టల్ శాఖ అధ్వర్యంలో ఫిలాటలీ(స్టాంపుల సేకరణ) స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించనున్నట్లు కర్నూలు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జి. జనార్దన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన ద్వారా స్కాలర్‌షిప్ పరీక్షను సెప్టెంబర్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం విద్యాసంవత్సరంలో 6వ తరగతి నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు అర్హులన్నారు. వీరందరికీ గడిచిన విద్యా సంవత్సరం 2023-24లో 60 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మార్కులలో 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈ పరీక్ష రెండు విభాగాలుగా ఉంటుందని ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రూ.6000 స్కాలర్‌షిప్ అందిస్తారన్నారు. ఆసక్తిగల విద్యార్థులు వ్యక్తిగతంగా/పాఠశాల ప్రిన్సిపాల్ ద్వారా ఫిలాటలీ డిపాజిట్ అకౌంట్‌ను రూ.200తో సెప్టెంబర్ 19వ తేదీలో లోపల కర్నూలు ప్రధాన తపాలా కార్యాలయంలో దరఖాస్తు జతపరచి ఒక కవరులో పోస్టు మాస్టర్ జనరల్, కర్నూలు రీజియన్, కర్నూలు-518002కు పంపాలన్నారు.

ట్రావెల్ బస్సుకు భారీ జరిమానా

డోన్(రూరల్), ఆగస్టు 23: రోడ్ ట్యాక్స్ కట్టకుండా తిరుగుతున్న ట్రావెల్ బస్సుకు భారీ జరిమానా విధించారు. డోన్ పట్టణ సమీపంలోని హైవేపై ఇన్‌చార్జి ఆర్టీవో అధికారి పి. నాగేంద్రరావు తనిఖీలు నిర్వహించారు. అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన ట్రావెల్ బస్సు కోయంబత్తూరు నుంచి హైదరాబాదు వెళ్తుండగా.. రాష్ట్రానికి కట్టాల్సిన రోడ్ ట్యాక్స్ కట్టలేదని గుర్తించిన డోన్ ఇన్‌చార్జి ఆర్‌టీవో ట్రావెల్ బస్సుకు రూ.2,76,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

దొంగ అరెస్టు

ఆలూరు, ఆగస్టు 23: ఆలూరు సర్కిల్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం కడదర బెంచి గ్రామానికి చెందిన భాస్కరాచారి అనే వ్యక్తిని శుక్రవారం మొలగవల్లి క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్, ఎస్సై వెంకట నరసింహులు తెలిపారు. అతని వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోతో పాటు 31వేలు నగదు స్వాధీనం చేస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలి పారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి, కుమారుడికి గాయాలు

ఎమ్మిగనూరు, ఆగస్టు 23: మండల పరిధిలోని ఎర్రకోట గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి దావీదు (36) మృతి చెందగా, కుమారుడు చరణ్ తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు ఎర్రకోటకు చెందిన దావీదు ఎమ్మిగనూరులో పని ముగించుకొని కుమారుడితో కలిసి మోటర్‌సైకిల్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. గ్రామ స మీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో దావీదు అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), ఆగస్టు 23: రాయలసీమ యూనివ ర్సిటీ పరిధిలో మార్చిలో నిర్వహించిన పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. రెగ్యులర్ విభాగంలో 93 మందికి 89, యూనివర్సిటీ విభాగంలో 244కు 234, సప్లమెంటరీ విభాగంలో 35కు 26, యూనివర్సరీ విభాగంలో 38కి 30 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

అక్రమ మద్యం ధ్వంసం



అక్రమ మద్యాన్ని ధ్వంసం చేస్తున్న అధికారులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 23 : ఎమ్మిగనూరు సెబ్ స్టేషన్ పరిధిలోని, ఎమ్మిగనూరు మండలం బనవాసి దగ్గరలో సెబ్ పోలీసులు గతంలో పట్టుకున్న అక్రమ మద్యాన్ని శుక్రవారం ధ్వంసం చేశారు. సెబ్ ఎఈఎస్ వినోద్‌కుమార్ సమక్షంలో 12డిపిఎల్ కేసులలో 54.72 లీటర్లు, 77ఎన్‌డిపిఎల్ కేసులలో మొత్తం 2293.68 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశారు. వీటి విలువ మార్కెట్లో సుమారు రూ 10,59,700 అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీ ఐ భార్గవ్ రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ: పత్తికొండ సెబ్ సర్కిల్ పరిధిలో పట్టుబడ్డ అక్రమ మద్యాన్ని శుక్రవారం వాహనాలతో ధ్వంసం చేశారు. సెబ్ డిఎస్పీ విరాట్‌కుమార్ నేతృత్వంలో సువర్ణలత, సిబ్బంది స్థానిక బైపాస్ రోడ్డులో మద్యాన్ని ధ్వంసం చేశారు.

కోసిగి: కోసిగి మండల పరిధిలోని సాతనూరు పంప్ హౌస్ దగ్గర సాతనూరు గ్రామానికి చెందిన కె. గోవిందరాజులు బైక్‌పై అక్రమ కర్ణాటక మద్యం 768 టెట్రా మద్యం ప్యాకెట్లను తీసుకువస్తుండగా.. దాడులు చేసి పట్టుకున్నట్లు సెబ్ సీఐ మహబూబ్‌బాషా, ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. అలాగే కోసిగి ఆర్టీసీ బస్టాండు వెనుకాల కొరివి హనుమప్ప అనే వ్యక్తి వద్ద నుంచి 107 టెట్రా ప్యాకెట్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు కర్నూలు డీటీఎఫ్ సెబ్ సీఐ ఈరన్నస్వామి తెలిపారు.

సచివాలయ ఉద్యోగిపై ఆకతాయిల దాడి

పోలీసులకు ఫిర్యాదు



గాయాలతో బాధితుడు ప్రవీణ్

ఆదోని, ఆగస్టు 23: ఆదోని పట్టణంలోని 28వ వార్డు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగిపై శనివారం ఆకతాయిలు దాడి చేశారు. సచివాలయ ఉద్యోగి ప్రవీణ్ చిన్న మార్కెట్ ప్రాంతంలో బైక్‌పై వెళుతుండగా ఎదురుగా రాంగ్ రూట్‌లో మరో బైక్‌పై ముగ్గురు ఆకతాయిలు వచ్చి ఆయన బైక్‌ను ఢీకొట్టారు. రాంగ్ రూట్‌లో రావడం ఏమిటని ప్రవీణ్ ప్రశ్నించడంతో ఆయనపై దాడి చేశారు. రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు శిక్షణ



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న కునిగిరి నీలకంఠ

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 23 : ఎమ్మిగనూరు పట్టణంలో బీజేపీ జిల్లా సభ్యత్వ నమోదు శిక్షణా కార్యక్రమం కుర్ణి కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై సీరియస్

కర్నూలు(అర్బన్), ఆగస్టు 23: పూడిచెర్ల గ్రామంలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఓర్వకల్లు మండలంలోని పూడిచెర్ల ప్రాంతంలో ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించి మట్టి తరలిస్తున్న 3 టిప్పర్లు సీజ్ చేసి ఓర్వకల్లు పోలీస్టేషన్‌కు తరలించారు. సదరు ప్రాంతంలో మట్టిని ఎయిర్‌పోర్టు కోసం తరలించారని, మరో మారు ఏపీఐఐసీ నిర్మాణాలకు వాడేందుకు మట్టిని తవ్వుతున్నామన్న కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేస్తామన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు, ఆగస్టు 23: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శేఖర్ (48) అనే వ్యక్తి శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన భార్య మహేశ్వరి ఐదేళ్ల కింద కుటుంబ కలహాలతో విడిపోయింది. శేఖర్ మద్యానికి బానిస అయ్యాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. బంధువులు గుర్తించి ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

కర్నూలు, ఆగస్టు 23: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానిక గీతాముఖర్జీనగర్‌కు చెందిన విద్యార్థిని సెయింట్ జోసెఫ్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్రవారం పరీక్షలో కాపీయింగ్‌కు పాల్పడటంతో అధ్యాపకులు ఆ విద్యార్థినిని మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆ విద్యార్థిని భవనంపై నుంచి కిందకు దూకింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలైన ఆ విద్యార్థిని ఆసుపత్రిలో చేర్పించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



పెద్ద రంగన్న (ఫైల్)

గోనెగండ్ల, ఆగస్టు 23: అనుమానాస్పద స్థితిలో ఆస్పరి మండలం వలగొండ గ్రామానికి చెందిన కురువ లచ్చపోలు పెద్ద రంగన్న(46) చిన్నమరివీడు గ్రామంలో దస్తగిరయ్య పూజారి కాశింస్వామి దర్గ దగ్గర మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. తన భర్త మృతి అనుమానాస్పదమని అతని భార్య ఈశ్వరమ్మ అన్నది. వలగొండ గ్రామాని చెందిన ఈశ్వరమ్మకు గత కొన్ని నెలలుగా కళ్ల నొప్పులు ఉండేవి. పలు చోట్ల వైద్యం చేయించినా వ్యాధి నయం కాలేదు. అయితే వారి సమీప బంధువు నాగరాజుతో కలిసి గోనెగండ్ల మండలం చిన్నమరివీడు గ్రామానికి చెందిన దస్తగిరయ్య పూజారి కాశింస్వామికి పూజలు చేయడానికి భార్యతో కలిసి వెళ్లాడు. అయినా ఈశ్వరమ్మకు వ్యాధి నయం కాలేదు. దీంతో కాశింసామి తమ ఇంటికి వచ్చి పూజలు చేయడానికి కొంత డబ్బు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. 20వతేది కాశింస్వామి, బోదేపాడు గ్రామానికి చెందిన ప్రభాకర్, నెల్లిబండ గ్రామానికి చెందిన శివ.. నాగరాజుతో కలిసి ఈశ్వరమ్మ ఇంట్లో 40 చోట్ల గుంతలు తవ్వి ప్రత్యేక పూజలు చేశారు. 21వ తేదిన సాయంత్రం ఈశ్వరమ్మ భర్త పెద్ద రంగన్నకు గొంతునొప్పి, ఛాతీ నొప్పి వచ్చింది. 22వ తేది గురువారం సాయంత్రం చిన్నమరివీడు గ్రామంలోని దస్తగిరయ్యస్వామి దర్గ దగ్గరకు ఆటోలో పెద్ద రంగన్నను తీసుకువెళ్లారు. అక్కడ నొప్పి ఎక్కువై మృతి చెందాడు. అయితే తన భర్త మరణంపట్ల అనుమానం ఉందని ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొన్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

వెటర్నరీ డాక్టరుపై ఫిర్యాదు

ఎంక్వైరీ నివేదిక ప్రభుత్వానికి అందజేత

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 23: కల్లూరు వెటర్నరీ హాస్పిటల్‌లో పని చేస్తున్న ఏడీహెచ్ వైద్యుడు పార్థసారథిపై ఇటీవల కొంత మంది మహిళా ఉద్యోగులు, యూనియన్ నాయకులు ఏడీహెచ్ తమను దుర్భాషలాడాడని పశుసంవర్ధకశాఖ జేడీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. వ్యవహారంపై ఇటీవల జేడీ శ్రీనివాస్ ఫిర్యాదు చేసిన వారిని విచారించారు. అనంతరం నివేదికలను ప్రభుత్వానికి పంపామని శుక్రవారం విలేకరులకు జేడీ శ్రీనివాస్ తెలిపారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక రాష్ట్ర మంత్రి

మంత్రాలయం, ఆగస్టు 23 : కర్ణాటక రాష్ట్ర మంత్రి మంకల్ ఎస్ వైద్య సతీసమేతంగా శుక్రవారం మంత్రాలయం వచ్చి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. వీరికి మహా ముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్ స్వాగతం పలికారు. మంత్రి గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని పూజలు చేశారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

రైలు నుంచి జారిపడి తమిళనాడు వాసి మృతి

కోసిగి, ఆగస్టు 23: కోసిగి రైల్వేస్టేషన్ సమీపంలోని షిరిడీ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి తమిళనాడులోని నమశివయ్యపురం చోలమీయుడు ప్రాంతానికి చెందిన కమలాకణ్ణన్ అనే వ్యక్తి మృతి చెందాడు. కోసిగి రైల్వేస్టేషన్ మాస్టర్ తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి 8:30 గంటల సమయంలో షిరిడీ ఎక్స్‌ప్రెస్(రైలు నం:22602) ట్రైన్ కోసిగి రైల్వే స్టేషన్ మీదుగా వెళ్తున్న సమయంలో తమిళనాడుకు చెందిన కమలాకణ్ణన్ ప్రమాదవశాత్తు కిందకు జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన రెండుకాళ్లు పూర్తిగా తెగిపోయాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.

పదేళ్లుగా పాతుకుపోయారు

- ఒకే మండలంలో తిష్టవేసిన ఉద్యోగులు
- గ్రేడ్ల వారీగా దక్కని పోస్టింగులు
- బదిలీలు తప్పనిసరి కావడంతో పైరవీలు



కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 23: జిల్లాలో గ్రామ పంచాయతీలు 484 ఉన్నాయి. గ్రేడ్-1లో 17, గ్రేడ్-3లో 67, గ్రేడ్-4లో 137, గ్రేడ్-5లో 193, గ్రేడ్-382లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు 450 మంది పని చేస్తున్నారు. జిల్లాలోని కొంత మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఒకే మండలంలో అనేక సంవత్సరాలుగా తిష్ట వేశారు. ప్రభుత్వాలు మారినా తాము మాత్రం ఇక్కడే ఉంటా.. మరో చోటకు వెళ్లేది లేదంటూ కొందరు ఉద్యోగులు పట్టుపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొంత మంది అధికారులు జీతం ఒక చోట, బాధ్యతలు మాత్రం మరొక చోట నిర్వహిస్తున్నారు. చిన్న గ్రామ పంచాయతీలలో పెద్ద గ్రేడ్ కలిగిన పంచాయతీ కార్యదర్శులు పని చేస్తున్నారు. కొందరు తమ విధులు నిర్వర్తించకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ మండలం దాటకుండా ఏళ్లకుతరబడి పాతుకుపోయారు. గ్రామ పంచాయతీలను క్లస్టర్ హెడ్ క్వార్టర్స్ గానూ, క్లస్టర్ గ్రామ పంచాయతీలుగా విభజించారు. క్లస్టర్ హెడ్ క్వార్టర్స్‌లో గ్రేడ్ 1-4 వారిని నియమించవచ్చు. క్లస్టర్ గ్రామ పంచాయతీలలో మాత్రం కచ్చితంగా గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులను మాత్రమే నియమించాలి. గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలను ఉల్లంఘించి అనేక మంది పంచాయతీ కార్యదర్శులకు ఇష్టమైన చోటకు పోస్టింగులు కేటాయించారు. కల్లూరులో నలుగురు, కర్నూలులో ఆరుగురు డిప్యుటేషన్‌పై ఒకరు వీఆర్వోలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఐదు సచివాలయాలకు కలిపి ఒక వీఆర్వోను ఇన్‌చార్జిగా కొనసాగిస్తున్నారు. చాలా మంది వీఆర్వోలు సచివాలయం మ్యాపింగ్ చేసుకోకుండా తహసీల్దార్ ఆఫీసులో నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బదిలీలకు దరఖాస్తులు: సంబంధిత శాఖలో ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారికి బదిలీ తప్పనిసరి అని చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ తహసీల్దార్లు 2, సీనియర్ అసిస్టెంట్లు 5, జూనియర్ అసిస్టెట్లు 10, గ్రేడ్-2, వీఆర్వోలు 66, రిక్వెస్టు బదిలీల కోసం వందమంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో పంచాయతీరాజ్ శాఖలో డీఎల్‌పీవో ఒకరు, ఏవోలు ఇద్దరు, గ్రేడ్-1 ఇద్దరు, గ్రేడ్-3 (14 మంది), గ్రేడ్-4 (19 మంది), జూనియర్ అసిస్టెంట్లు ముగ్గురు ఐదు సంవత్సరాలకు పైగా సంబంధిత శాఖలో సర్వీసు పూర్తి చేసుకున్నారు. భూసర్వే శాఖకు సంబంధించి మండల సర్వేలో ఏడుగురు, స్పెషల్ సర్వేయరు ఒకరు సంబంధిత శాఖలో ఐదు సంవత్సరాలు సర్వీసును పూర్తి చేసుకున్నారు. ఇలా మొత్తం మీద ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి: కలెక్టర్



అధికారులతో కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), ఆగస్టు 23: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. శుక్రవారం కర్నూలు మండలం గార్గేయపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్యసే వలు, గ్లూకోమీటరు, రోజువారీ ఓపీ తదితర వాటిపై ఆరా తీశారు. అనుపత్రి ప్రసవాలు, ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కాలం చెల్లిన మందులను వినియో గించరాదన్నారు. అనంతరం గ్రామంలోని జడ్పీ పాఠశాలలో అమలు అవు తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో మందుబా బుల ఆగడాలపై విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకరాగా, పాఠశాల పరిసరాల్లో రోజు పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం సాంఘిక సంక్షేమ వసతిగృహన్ని పరిశీలించి, విద్యార్థులకు భోజనాన్ని షెడ్ల కింద ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయలక్ష్మి, హేమలత, కర్నూలు రూరల్ తహసీల్దారు రమేష్‌బాబు పాల్గొన్నారు.

సూర్యదేవాలయంలో కమిషనర్ పూజలు



పూజల్లో పాల్గొన్న కమిషనర్ రామలింగేశ్వర్

కల్లూరు, ఆగస్టు 23: గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలోని సూర్యనారాయ ణస్వామి ఆలయంలో నగరపాలక సంస్థ కమిషనర్ రామలింగేశ్వర్ పూజలు నిర్వహించారు. శ్రావణమాసం పురస్కరించుకుని శుక్రవారం ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ సమీపంలోని గోశాలకు చేరుకుని గోమాతలకు గ్రాసం అందించారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ట్రస్టీ టి.శివరా మక్రిష్ణ కమీషనర్ రామలింగేశ్వర్‌కు తీర్థప్రసాదాలు అందించి శాలువాతో సన్మానించారు.

● శ్రావణమాస పూజలు: సూర్యనారాయణస్వామి ఆలయంలో శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా రాహుకాల సమయంలో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల అధ్వర్యంలో సాయంత్రం అమ్మవారి సన్నిధిలో రాహుకాల, దుర్గాపూజ, లలితా సహస్రనామ పారాయణం చేశారు.

అత్యవసర పనులకు ప్రాధాన్యం ఇవ్వండి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 23: నగరంలో అత్యవసర పనులకు ప్రాధాన్యం ఇస్తూ రహదారులు, మురుగుకాలువల నిర్మాణాలను చేపట్టాలని మేయర్ బీవై.రామయ్య ఇంజనీరింగ్ విభాగ అధికారులకు ఆదేశించారు. 23వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో ఊట ఏర్పడి రోడ్డుపై నీరు చేరి బురదమయంగా మారు తుందని ఫిర్యాదు రావడంతో మేయర్ శుక్రవారం ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ మురుగు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం డోజర్ తెప్పించి నీటిని తొలగించారు. ఆయన వెంట డీఈ క్రిష్ణలత, స్థానికులు కటారి సురేష్, ఓబులేసు ఉన్నారు.

గెస్టు అధ్యాపకుల కోసం దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 23: ఓర్వకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ సబ్జెక్టును బోధించడానికి గెస్టు అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌ఐవో, ప్రిన్సిపాల్ ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి శుక్రవారం తెలిపారు. పీజీలో సంబంధిత సబ్జెక్టులో 50 శాతం ఉత్తీర్ణత పొంది ఉండా లన్నారు. ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు డెమో క్లాసులకు హాజరు కావాలన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఓర్వకల్లు, ఆగస్టు 23: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై ఈ నెల 20న ఓర్వకల్లు గ్రామ సమీపంలోని ఫ్లైఓవర్‌పై గుర్తు తెలియని వ్యక్తి గాయా లతో పడి ఉండగా.. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కర్నూలు ప్రభు త్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ కోసం 9121101067 నెంబరును సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 23: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కల్గునని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ అన్నారు. శుక్రవార డీఎస్‌ఏ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా బాస్కెట్‌బాల్, ఖో-ఖో, ఫెన్సింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలకు 500 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

పండ్లతోటల పరిశీలన

సి.బెళగల్, ఆగస్టు 23: మండలంలోని మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి, ఇనగండ్ల గ్రామాల్లోని పండ్లతోటలను కోడుమూరు ఉద్యానవన శాఖ అధికారి మధు సూదన్‌గౌడు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్లతోటలను సాగు చేసుకోవడానికి రైతులు ముందుకు రావాలన్నారు.

సముద్రాల హనుమంతరావుకు నివాళి



నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 23: కర్నూలుకు చెందిన టీడీపీ మాజీ అధికార ప్రతినిధి, బ్రాహ్మణ సంఘాల నాయకుడు దివంగత సము ద్రాల హనుమంతరావుకు బ్రాహ్మణ సంఘాల నాయకులు నివాళులర్పించారు. గురువారం నగరంలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సర్కి ల్‌లో, బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈకార్యక్రమానికి టీడీపీ బ్రాహ్మణ సాధికారిక సమితి కర్నూలు పార్లమెం టరీ కన్వీనర్ టీవీ రవిచంద్ర శర్మ, సాధికారిక సమితి సభ్యులు కప్పగంతుల పురు షోత్తం, సీవీ దుర్గాప్రసాద్, శ్యామ్ సుందర్ శర్మ, చల్లా నాగరాజ శర్మ హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ అనేక సమస్యలపై సముద్రాల హను మం తరావు పోరాటాలు చేశారని గుర్తు చేసుకున్నారు.

గ్రామసభలతో స్వర్ణయుగం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, ఆగస్టు 23: గ్రామ పంచాయతీలను సుస్థిరంగా అభివృద్ధి చేసి స్వర్ణయుగం స్థాపించేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శుక్రవారం మండలంలోని నన్నూరు గ్రామ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గౌరు చరిత హాజరయ్యారు. ఆ సభకు గ్రామ సర్పంచ్ బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. హుశేనాపురం గ్రామ సభకు సర్పంచ్ చంద్ర గోవర్ధనమ్మ అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథిగా నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అద్భుతమైన నిర్ణయం తీసుకుని దేశంలో ఎన్నడూ లేనివిధంగా 13,326 గ్రామ పంచాయతీలలో ఒకే రోజు గ్రామ సభలు నిర్వహిస్తున్నదని అన్నారు. గ్రామ సభల్లో తీర్మానాలు అమలు చేయడం వల్ల గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, డీఎల్‌డీవో బాలకృష్ణ, ఎంపీడీవో శివనాగప్రసాద్, తహసీల్దార్ వెంకటరమణ, విశ్వేశ్వరరెడ్డి, విజయుడు, ఖాజామియా, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

● **గ్రామాల్లో గ్రామ సభలు :** ఓర్వకల్లులో ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, గుట్టపాడులో సర్పంచ్ మోహన్ రెడ్డి, పాలకొలనులో సర్పంచ్ చదువుల సుజాతమ్మ తదితర గ్రామాల్లో సర్పంచుల అధ్యక్షతన వహించిన గ్రామ సభలను నిర్వహించారు. ఈ సభల్లో పలు పథకాలు, పనులపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో గోవిందరెడ్డి, రామభూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, పాలకొలను సుధాకర్‌రెడ్డి, చంద్ర పెద్దస్వామి, సుధాకర్, వెంకటేశ్వర్లు, ఆకుల మహేష్, కాకి దేవేంద్ర, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కల్లూరు: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గ్రామంలో చేపట్టాల్సిన ఉపాధి హామీ పనుల గుర్తింపు కోసం శుక్రవారం కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ రమణ, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన జగన్‌రెడ్డి సర్పంచులను ఉత్సవ విగ్రహాల్లా మార్చారన్నారు. గ్రామాల్లో వీధిలైట్లు, డ్రైనేజీ, రోడ్లు, త్రాగునీటి సరఫరాకు సర్పంచులు అప్పులు చేశారని తెలిపారు. గ్రామసభలో రూ.3కోట్లతో మొత్తం 20 పనులు గుర్తించామన్నారు. తక్షణమే రూ.40 లక్షలు విడుదల చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిషోర్, ఏపీఓ మద్దీశ్వరమ్మ, ఉలిందకొండ టీడీపీ సీనియర్ నాయకుడు ఈవీరమణ, రంగస్వామిరెడ్డి, యుద్ధం శ్రీనివా సులు, సుబ్బరాయుడు, మురళి, వెంకటేశ్వర్లు, దస్తగిరినాయుడు, ఈవీశ్రీకాంత్, విక్రమ్, సీవీ రమణ, మహేంద్ర, షేక్షావలి, కరీం తదితరులు పాల్గొన్నారు.

● **గ్రామసభలు విజయవంతం:** కల్లూరు మండలంలోని 18 గ్రామాల్లో శుక్రవారం చేపట్టిన గ్రామసభలు విజయవంతమైనట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కర్నూలు(రూరల్): కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. గత ఏడాది నుంచి జరిగిన అభివృద్ధి పనులు, రాబోయే ఏడాదిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామస్థులు చర్చించారు. గత ఏడాది నుంచి ఉల్చాల గ్రామంలో సుమారు రూ.39 లక్షలు చేయని పనులకు చేసినట్లు వైసీపీ నాయకులు బిల్లులు పెట్టారని గ్రామ నాయకులు ఆరోపించారు. ఈ బిల్లులు తీసుకున్న ఉల్చాల ఉప సర్పంచ్ ధర్మవరం వాసు, అతనికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రాములమ్మ, బీసన్న, మద్దిలేటి, కర్నూలు మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశ్ నాయుడు, హనుమంతు, శివన్న, చెన్నయ్య, ప్రభాకర్, చిన్న తిమ్మప్ప, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గూడూరు: గ్రామాల అభివృద్ధికే ప్రభుత్వం ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తోందని ఎంపీడీవో విజయసింహారెడ్డి అన్నారు. శుక్రవారం గూడూరు మండలం గుడిపాడు గ్రామంలో 2024-25లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టె పనులకు సంబంధించి గ్రామ సభను నిర్వహిం చారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామానికి అవసరమైన సీసీరోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, పాఠశాల ప్రహరీ, ఇతర అభివృద్ధి పనులు చేపటేందుకే గ్రామ సభను నిర్వహించామన్నారు. స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ సునిల్ కన్నా, టీడీపీ నాయకుడు మహేశ్వర రెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

కోడుమూరు: స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనులను నిమిత్తం సర్పంచు భాగ్యరత్న ఆధ్వర్యంలో గ్రామ సభను చేపట్టారు. రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు హాజరై పలు ప్రాంతాలల్లో పనులు చేపట్టాలని వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి అజయ్‌భాస్కర్, మాజీ సర్పంచు సీబీ లత, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేఈ మల్లికార్జునగౌడ్, మండల కన్వీనర్ కోట్ల కవితమ్మ, టీఎన్‌టీయూసీ తాలుకా అధ్యక్షులు గోపాల్‌నాయుడు, బడేసాగౌడ్, రాముడు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు(రూరల్): గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు ఏపీవో మోదీన్‌బాష తెలిపారు. మండలంలోని వెంకటగిరిలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు గుర్తించుట, సీసీ రహదారులు, డ్రైనేజీలు, సోప్ పిట్స్, చెత్తసంపద కేంద్రాలకు అప్రోచ్ రోడ్లు, మరమ్మతు పనులు, బోర్ల రీచార్జ్ వంటి వాటిపై అభివృద్ధి ప్రణాళికలు చేస్తున్నట్లు సమస్యలపై గ్రామ సభ దృష్టికి తీసుకరావాలని కోరారు. అనంతరం ప్రజలు సభ దృష్టికి తీసుకవచ్చిన సమ స్యలపై తీర్మాణం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణమ్మ, ఎంపీటీసీ సుజాత, పంచాయతీ కార్యదర్శి ఉసేన్ టీడీపీ నాయకులు నారాయణ, చంద్ర, పెద్దయ్య, గంగులు, కురువ రంగన్న పాల్గొన్నారు.

సి.బెళగల్: పంచాయతీల అభివృద్ధి కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో రాముడు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీరు, సీసీరోడ్లు, మురుగుకాలువలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, తదితర అంశాలపై గ్రామస్థులతో అధికారులు సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



నన్నూరు గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత



హుశేనాపురంలో మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్



గూడూరు మండలం గుడిపాడులో మాట్లాడుతున్న ఎంపీడీవో



కోడుమూరు గ్రామ సభలో వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

హాస్టల్‌ను పరిశీలించిన ఆర్డీవో



వంట గదిని పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్

కోడుమూరు (రూరల్), ఆగస్టు 23: మండలంలోని లద్దగిరి బీసీ హాస్టల్ 1, 2 లను ఆర్డీవో శేషిరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులు, సౌకర్యాలపై వార్డన్ శ్రీనివాసులునడిగి తెలుసుకున్నారు. దీంతో తాగునీరు, గదులకు కిటికీలు, తలుపులు, కిచెన్ షెడ్డు సమస్యలు, టాయిలెట్లకు రన్నింగ్ వాటర్, పలు గదుల పైకప్పు పెచ్చులూడుతున్నట్లు ఆర్డీవో దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా గదులు, టాయిలెట్లు, వంట గదిని ఆర్డీవో పరిశీలించారు. విద్యార్థులకు మంచి నాణ్యమైన భోజనం అందించాలని, వర్షాలు కురుస్తున్నందున దోమలు పెరగకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్వో రాఘవేంద్ర పాల్గొన్నారు.

11 నుంచి ఆన్‌లైన్ ద్వారా ఇసుక పంపిణీ

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 23: సెప్టెంబరు 11 నుంచి ఆన్‌లైన్ ద్వారా ఇసుక పంపిణీకి చర్యలు చేపట్టడం జరుగుతోందని జిల్లాలో ఇసుక పంపిణీలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండరాదని మైన్స్ అండ్ ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ప్రిన్సిపల్ సెక్రటరీ విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇసుక పంపిణీపై సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ముందుగా బుకింగ్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని అందులో ముందుగా వచ్చిన వారికి ముందుగా టోకెన్ సౌకర్యం ద్వారా ఇసుక సప్లయ్ చేయాలని, సప్లయ్ పాయింట్లులో పద్ధతిలో ఇచ్చిన టైం స్లాట్ టోకెన్ల ప్రకారం ఇసుక పంపిణీ జరగాలని, అక్కడ ఎటువంటి పరిస్థితుల్లో పెద్ద పెద్ద క్యూలు ఉండరాదని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ బి.నవ్య, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కె.శ్రీధర్, మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ పాల్గొన్నారు.

వ్యవస్థలో సంపూర్ణ మార్పు రావాలి

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 23: వ్యవస్థలో సంపూర్ణ మార్పు రావాల్సిన అవసరం ఉందని, అప్పుడే మహిళలకు సంపూర్ణ రక్షణ లభిస్తుందని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అభిప్రాయప డ్డారు. శుక్రవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో జేవీవీ, జేవీవీ మహిళా విభాగం సమత, ఏపీ మహిళా సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో కోల్‌కతా వైద్యురాలి ఉదంతంపై సదస్సు నిర్వహించారు. 'మహిళలపై అత్యాచారాలు ఆగేదెప్పుడు?', 'మహిళల రక్షణకు మనం ఏమి చేయగలం', 'మహిళల రక్షణకు భద్రత ఏదీ' అనే అంశాలపై జరిగిన ఈ సదస్సునకు సమతా రాష్ట్ర నాయకురాలు సుజాత అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా హాజరైన డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ కోల్‌కతాలో వైద్యురాలి ఉదంతంపై దేశ వ్యాప్తంగా నిరసనలు రావడం మంచి పరిణామమేనని, అయితే మణిపూర్ ఘటనతోపాటూ ఇతరత్రా ఘటనలపై ఎందుకు అంత స్పందన రాలేదని ప్రశ్నించారు. ఈసదస్సులో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ఐద్వా నాయకురాళ్లు నిర్మలమ్మ, అలివేలు, ఏపీ మహిళా సమాఖ్య నాయకురాలు శ్రావణి, సమతా జిల్లా నాయకురాలు హరిత, మహిళా స్రవంతి నాయకురాలు రోజారమణి, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి శేషాద్రిరెడ్డి, జిల్లా నాయకులు ప్రతాపరెడ్డి, మహ్మద్ మియా, ఇనాయతుల్లా ప్రసంగించారు.

'పీఎం సూర్యఘర్ యోజన'ను వినియోగించుకోవాలి

కల్లూరు, ఆగస్టు 23: పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని విద్యుత్‌శాఖ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి అన్నారు. శుక్రవారం నగరంలోని ఏపీ ఎస్పీడీసీఎల్ ఇంజనీర్స్ అసోసియేషన్ గెస్ట్ హౌస్‌లో విద్యుత్ ప్రోత్సాహకంలో భాగంగా ఏర్పాటు చేసిన 15 కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్‌ను ఎస్ఈ ప్రారంభించారు. ఈమేరకు సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేశామన్నారు. కార్యక్రమంలో కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఘనంగా అంతరిక్ష దినోత్సవం

కోడుమూరు(రూరల్), ఆగస్టు 23: మండలంలోని అమడగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంతరిక్ష, చంద్రయాన్ ప్రయోగాల వీడియోలు విద్యార్థులు వీక్షించేలా ఏర్పాటు చేశారు. అనంతరం హెచ్‌ఎం అనంతయ్యయాదవ్ మాట్లాడుతూ చంద్రయాన్ 3 విజయానికి గుర్తుగా కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు.

కర్నూలు(అర్బన్): అంతరిక్షంలో మన దేశం చరిత్ర సృష్టిస్తోందని ప్రిన్సిపాల్ జహనరా కొనియాడారు. శుక్రవారం డాక్టర్ అబ్దుల్‌హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతికి ఇచ్చిన సందేశాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంతరిక్షంలో భారత దేశం సాధించిన విజయాలను పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ప్రకటించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటప్ప, డాక్టర్ పాల్ కృపాకర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి







బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీవీఈవో పరమేశ్వరరెడ్డి, జిల్లా పరిషత్‌లో నివాళులర్పిస్తున్న జడ్పీ సీఈవో, ఆర్‌యూలో నివాళులర్పిస్తున్న వీసీ

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 23: బీక్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతుల జయంతిని ఘనంగా నిర్వహించారు. మందుగా ఆయన చిత్రపటానికి డీవీఈవో పరమేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, రిటైర్డు ప్రిన్సిపాల్ కొట్టె చెన్నయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడిగా ప్రకాశం పంతులు చేసిన సేవలను గుర్తించి ఒంగోలు జిల్లాను ప్రకాశం జిల్లాగా మార్చారన్నారు. అధ్యాపకులు ప్రసన్న కుమార్, రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, సోమేష్, పార్థసారథి, పటేల్, చిన్నమల్లేశ్వరుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు(న్యూసిటీ): ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జడ్పీ సీఈఓ నాసరారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని జడ్పీ మినీ సమావేశభవంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఈఓ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి మొట్టమొదటి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం సేవలు అభినందనీయమన్నారు. పరిపాలన అధికారులు సి. మురళీమోహన్‌రెడ్డి, జితేంద్ర, బసవశేఖర్, సౌభాగ్యలక్ష్మీ, గాయత్రి పాల్గొన్నారు.

కర్నూలు(అర్బన్): స్వాతంత్ర పోరాటంలో బ్రిటీష్ వారి తుపాకీ గుళ్లను ఎదురించిన ధీరుడు టంగుటూరి ప్రకాశం పంతులని డీసీసీ అధ్యక్షుడు కే.బాబు రావు అన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యా లయంలో జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు, షేక్ జిలాని, అనంత రత్నం మాదిగ, బి.బతుకన్న, బజారన్న పాల్గొన్నారు.

● తెలుగు జాతి గర్వించదగ్గ ఆణిముత్యం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలోని సెనేట్ హాలులో టంగుటూరి ప్రకాశం పం తులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఎన్.నరసింహులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

గూడూరు ఆగస్టు 23: గూడూరు నగర పంచాయతీ పరిధిలోని సచివాలయాన్ని జాయింట్ కలెక్టర్ నవ్య శుక్రవారం తనిఖీ చేశారు. గూడూరు నగర పంచాయతీ పరిధిలో ఎన్ని కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఇచ్చారు.. ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని తహసీల్దార్ రామాంజ నేయులు, ఇన్‌చార్జి కమిషనర్ రవికుమార్‌లను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పెంచికల పాడు గ్రామంలో ఆమె పర్యటించారు. రెవెన్యూ, నగర పంచాయతీ, సచివాలయ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వంకను పరిశీలించిన ఇరిగేషన్ జేఈ

కల్లూరు, ఆగస్టు 23: పెద్దపాడులో వడ్లోని వంకను ఇరిగేషన్‌శాఖ జేఈ నాగరాజుతో కలిసి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.రామకృష్ణ, మండల కార్యదర్శి కె.మధు పరిశీలించారు. గత సోమవారం వడ్లోనివంక ఆక్రమణకు సంబంధించి సీపీఎం నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఇరిగేషన్ అధికారి శుక్రవారం అక్కడకు చేరుకుని స్థలాన్ని పరిశీలించారు. దీనిపై రెవెన్యూ అధికారులతో చర్చించి నివేదికలను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), ఆగస్టు 23: అటవీశాఖ పరిధిలోని ఇసుకను తరలిస్తే కఠినచర్యలు తప్పవని, ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి డీఎఫ్‌వో సూర్యచందరాజు హెచ్చరించారు. గురు, శుక్రవారాల్లో వెంకన్నబావి సమీపంలోని అటవీశాఖ ప్రాంతం నుంచి అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న ఇసుకను సీజ్ చేశారు. సూర్యచంద్రరాజు బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా, అంబేద్కర్‌నగర్, వెంకన్నబావి ప్రాంతానికి చెందిన కల్యాణ్, మదర్‌సాహెబ్ తమ వాహనాల్లో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా, వారిని గుర్తించి పట్టుకున్నారు. అనంతరం ఇసుక వాహనాలను కార్యాలయానికి తరలించి, వారికి అపరాధరుసుంగా ఒక్కొక్కరికి రూ.34 వేలు చొప్పున జరిమానా విధించారు.

పారిశుధ్యంపై శిక్షణ

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 23: డీఆర్‌డీఏ టీటీడీ ఎస్‌పీపీ మాస్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని సెర్ప్, మెప్మా సిబ్బందికి పారిశుధ్యంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై మెప్మా పీడీ నాగ శివలీల మాట్లాడుతూ పొదుపు గ్రూపులోని ప్రతి ఒక్క సభ్యురాలికి నీరు, పారిశుధ్యంపై అవగాహన కల్పించి వాటిని పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఆరు ఇండికేటర్స్‌ను అమలు చేయండి

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 23: జిల్లాలో ఆస్పిరేషన్ బ్లాకులలో సంపూర్ణత అభియాన్ కింద ఇచ్చిన ఆరు ఇండికేటర్స్‌ను సెప్టెంబరు లోగా వంద శాతం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం శుక్రవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఆస్పిరేషనల్ జిల్లాలను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి, సీపీవో హిమప్రభాకర్ రాజు, జేడీ అగ్రికల్చర్ పార్వతి పాల్గొన్నారు.

నూతన న్యాయ చట్టాలను రద్దు చేయాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 23: ఎస్సీ, ఎస్టీ అత్యాచారా నిరోధక చట్టాలను నిర్వీర్యం చేసే కొత్త న్యాయ చట్టాలను రద్దు చేయాలని కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం బుధవారపేటలోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం జూలై నుంచి తీసుకొచ్చిన మూడు న్యాయ చట్టాల వల్ల ఎస్సీఎస్టీ, అత్యాచార నిరోధక చట్టం నిర్వీర్యం అవుతుందని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి. ఆనంద్‌బాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు విజయమ్మ పాల్గొన్నారు.

త్వరలోనే పనులు ప్రారంభం

గూడూరు ఆగస్టు 23: గూడూరు నగర పంచాయతీ పరిధిలోని ముస్లింల పాత ఖబరస్థాన్‌కు ప్రహరీ నిర్మాణంతోపాటు ఖబరస్థాన్‌కు వెళ్లడానికి బ్రిడ్జి, షాదీఖానా నిర్మాణ పనుల త్వరలోనే ప్రారంభం అవుతాయని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సునీల్ కన్నా అన్నారు. శుక్రవారం గూడూరు నగర పంచాయతీ పరిధిలో కౌన్సిలర్ కోడుమూరు షాషావలి, టీడీపీ జిల్లా మైనార్టీ కార్యదర్శి డాక్టర్ మన్నన్ బాషా, మైనార్టీ నాయకులు రహిమాన్, ఇబ్రహీంలతో కలిసి జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సునీల్ కన్నా, సూపరింటెండెంట్ శ్యామ్‌బాబు ముస్లింల పాత ఖబరస్థాన్‌కు ప్రహరీ, బ్రిడ్జి నిర్మాణం, మధ్యలోనే నిలిచిపోయిన షాదీఖానాలను పరిశీలించారు.

'మహిళల రక్షణ చట్టాలు అమలు చేయాలి'

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 23: మహిళలకు సంపూర్ణ రక్షణ చట్టాలు అమలు చేయాలని, కోల్‌కతా వైద్యురాలి అత్యాచారం, హత్య ఘటన కు కారకులైన మానవ మృగాలకు కఠినంగా శిక్షించాలని ఆలిండియా బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) మహిళా విభాగం కన్వీనర్ పద్మావతి డిమాండ్ చేశారు. శుక్రవారం బుధవారపేట యూనియన్ బ్యాంకు శాఖా కార్యాలయం ఎదుట మహిళా బ్యాంకు ఉద్యోగులు కొవ్వొత్తులు వెలిగించి మృతురాలికి నివాళులు అర్పించారు. శివకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

ఐక్యంగా పోరాడుతాం

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 23: నీటి పారుదల శాఖలో ఔట్ సోర్సింగ్ లస్కర్లుగా గుర్తింపు పొందిన వారంతా ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కరించుకోగలమని ఏపీఈఈఏ గౌరవాధ్యక్షుడు రషీద్ అన్నారు. శుక్రవారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన లస్కర్ల సమావేశంలో రషీదు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ లస్కర్లు చేసే ఆందోళనలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎల్లెల్సీ ఔట్ లస్కర్లసంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

ఓర్వకల్లు, ఆగస్టు 23: రైతులు పండించిన పంటలకు ప్రభుత్వ పథకాలు, రాయితీలు వర్తించాలంటే ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏడీఏ శాలురెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హుస్సేనాపురం గ్రామంలో ఏవో సుధాకర్‌తో కలిసి మొక్కజొన్న, పత్తి పంటలను పరిశీలించారు. ఏఈవో భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 23: జాతీయ రహదారి 44 పక్కన సర్వీసు రోడ్డు వేయని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. బాలాజీనగర్, వెంకటరమణ కాలనీల్లోని సర్వీసు రోడ్డును సభ్యులు పరిశీలించారు.

గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం

ప్రారంభమైన గ్రామ సభలు ● హాజరైన ఎమ్మెల్యేలు, అధికారులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, ఆగస్టు 23: పార్టీలకు అతీతంగా పత్తికొండను అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే కేఈ.శ్యాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం పత్తికొండ గ్రామ పంచాయతీ గ్రామ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధితో రుణం తీర్చుకుంటానన్నారు. గ్రామాల్లో ఎక్కువగా వైసీపీ సర్పంచులు ఉన్నారని, అందరిని కలుపుకుని గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. పత్తికొండ పట్టణం ముందు నుంచి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయిందన్నారు. కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. పట్టణంలో రహదారి విస్తరణకు సంబంధించి అప్పటి ఎమ్మెల్యే టీడీపీ, వైసీపీ అంటూ పొంతనలేని కొలతలతో ప్రజలను ఇబ్బందుకు గురిచేశారన్నారు. ఈసారి ఖచ్చితమైన కొలతలతో అందరికి ఆమోదయోగ్యమైన రహదారి విస్తరణ చేస్తామన్నారు. ఆయనతోపాటు సర్పంచి కొమ్ము దీపిక, టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, బత్తిన వెంకటరాముడు, తిరుపాలు, ఏపీడీ పకీరప్ప, ఎంపిడివో కవిత, ఎపివో వెంకటేశ్వర్లు, ఏవో నరసింహాలు, సీఐ జయన్న పాల్గొన్నారు.

● గ్రామసభలో పత్తికొండ పట్టణానికి సంబంధించి 306 పనులను అధికారులు గుర్తించినట్లు తెలిపారు. అందుకు సంబంధించి రూ.16.4 కోట్లు నిధులు అవసరమవుతాయని వెల్లడించారు. ఈమేరకు అధికారులు తీర్మానం చేయగా ఎమ్మెల్యే, సర్పంచి ఆమోదించారు.

తుగ్గలి: నాయకులు, అధికారులు సమన్వయంతో పని చేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో సావిత్రి అన్నారు. శుక్రవారం మండలంలోని జొన్నగిరి, పగిడిరాయి, ఎర్రగుడి, రాంపల్లె, బొందిమడుగుల తదితర గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం కోసం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామంలోని రాబోయే కాలంలో చేపట్టాల్సిన పనులను, సమస్యలను గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు ప్రజల సమక్షంలో రాసుకుని వీటన్నింటిని పరిష్కరించాలని, ప్రతి గ్రామంలో తీర్మానం చేసి అధికారులకు అందించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటపతి, తిరుపాల్ నాయుడు, బాలన్న, రవి యాదవ్, సర్పంచ్‌లు ఓబులేసు, విజయలక్ష్మి, అప్పా వేణుగోపాల్, నాయక్, ఫక్కీరప్ప, సంగాల కృష్ణ, పులికొండ, విశ్వనాథ్ పాల్గొన్నారు.

దేవనకొండ: గ్రామాల్లో అభివృద్ధి జరగాలనే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తుందని మండల ప్రత్యేక అధికారి శ్రీవివాసరావు దేవనకొండలో అన్నారు. మండలంలోని 26 గ్రామాల్లో పంచాయతీలు, సచివాలయాల వద్ద సర్పంచుల సమక్షంలో గ్రామసభలు నిర్వహించారు. జనసేన, సీపీఐ నాయకులు మండలానికి అధిక నిధులు కేటాయించాలన్ని అధికారికి వినతి పత్రం ఇచ్చారు. సర్పంచులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కౌతాళం: పార్టీలకు అతీతంగా అందరం కలిసి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని కూటమి నాయకులు వెంకటపతిరాజు, అక్కమ్మతోట రామకృష్ణ, కురువ వీరేష్ అన్నారు. కౌతాళంలోని ఎమ్మార్సీ భవనం నందు శుక్రవారం గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్ అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకుడు రాఘవేంద్ర రెడ్డి గ్రామ సర్పంచ్ పంపాపతిగౌడ్, మండల నాయకులు ఉలిగయ్య, అడివప్పగౌడ్, సురేష్‌నాయుడు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో గీతావాణి తెలిపారు. శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఎంపీడీవో గీతావాణి గోనేహాళ్, మండిగిరి పంచాయతీలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో చాగిలో టీడీపీ జిల్లా నాయకులు మల్లి, నెట్టేకల్లులో టీడీపీ నాయకులు నాగరాజు, రవీంద్ర సింగ్, సలకలకొండలో ప్రతాప్ పాల్గొన్నారు.

కోసిగి: టీడీపీ ప్రభుత్వంలోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని టీడీపీ కర్నూలు పార్లమెంటు ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డిలు అన్నారు. శుక్రవారం కోసిగి మేజర్ పంచాయితీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ అయ్యమ్మ, పంచాయితీ కార్యదర్శి తిరుమలేశ్వర్ రెడ్డి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. తికార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎంపీపీ, ఈరన్న, ఎంపీటీసీ రాజు, టీడీపీ నాయకులు అయ్యన్న, భరద్వాజశెట్టి, మాజీ జడ్పీటీసీ రామకృష్ణ, వీరారెడ్డి, మాణిక్య రాజు, నరసారెడ్డి, మహాదేవ, తాయన్న, వక్రాణి వెంకటేశ్ పాల్గొన్నారు.

మంత్రాలయం: రాష్ట్ర ప్రభుత్వంలో గ్రామంలోని సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుడుతున్నట్లు టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ సంతోష్ కుమార్‌లు అన్నారు. శుక్రవారం మాధవరం పంచాయతీ కార్యాలయంలో గ్రామ కార్యదర్శి వేణుగోపాల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పవన్ కుమార్ అధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఈరన్న, బారికి ఉరుకుందు, విజయకుమార్, సీఆర్పీ బంగారప్ప, ఉపాధ్యాయులు నీలకంఠ రాజు, రాజశేఖర్, గుర్మింటి భీమిరెడ్డి, నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు అనిత, నరసమ్మ, తులసమ్మ, విశాలాక్షి పాల్గొన్నారు.

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో ప్రజల నుంచి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. శుక్రవారం మండలంలోని మద్దికెర, పెరవలి, బొమ్మనపల్లి, ఎం.అగ్రహారం గ్రామాల్లో గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో నరసింహమూర్తి, జడ్పీటీసీ సభ్యులు మురళిధర్ రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచులు సుహాసిని, విజయుడు, మల్లికార్జున, ఆంజనేయులు, టీడీపీ నాయకులు మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, జిల్లా టీడీపీ కార్యదర్శి ధనుంజయుడు చంద్రశేఖర్‌గౌడు, ఎల్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



కౌతాళంలో సర్పంచ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న కూటమి నాయకులు

పెద్దకడుబూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీటీసీ నరవశశిరేఖ అధికారులను కోరారు. శుక్రవారం హనుమాపురం గ్రామంలో జరిగిన గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నరవరమాకాంతరెడ్డి, ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

క్రిష్ణగిరి: గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా గ్రామసభలు నిర్వహిస్తున్నామని కర్నూలు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి ఆలంకొండ నబి సాహెబ్,ఆలంకొండ సర్పంచ్ షేక్ షహన అన్నారు.మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామసభలను నిర్వహించారు.

వెల్దుర్తి: మండలంలో 23 గ్రామపంచాయతీలలో శుక్రవారం అధికారులు గ్రామసభలు నిర్వహించారు. బొమ్మిరెడ్డిపల్లె గ్రామసభలో తహసీల్దార్ చంద్రశేఖరవర్మ, పుల్లగుమ్మి గ్రామసభలో ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప, వెల్దుర్తి గ్రామసభలో మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు, సూదేపల్లె గ్రామసభలో జయరాముడు, ఈదుల వెంకటరాముడు, కలగొట్ల గ్రామసభలో రామకృష్ణ, రామళ్లకోటలో రామకృష్ణ ఆచారి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుంకన్న, ఇన్‌చార్జీ ఈవో నాగేశ్వరరావు, విద్యుత్‌ఏఈ రాఘవేంద్ర ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

నందవరం: గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ప్రత్యేక అధికారి సీఎం ప్రసాద్, ఎంపీడివో దశరథరామయ్య అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభల్లో అయన పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్య, సీసీరోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు, తాగునీటి సమస్యలు ఏవైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో బంగారమ్మ కోరారు. శుక్రవారం ఎమ్మిగనూరు మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలను ఏర్పాటు చేశారు.

రూ. 19 కోట్లతో తాగునీటి పథకం మంజూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

గోనెగండ్ల, ఆగస్టు 23: కన్నూరు గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు గాను ప్రత్యేకంగా రూ. 19 కోట్లతో తాగునీటి పథకాన్ని మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం కున్నూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద గ్రామసభ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి పథకం శంకుస్థాపన కార్యక్రమాన్ని వారం రోజులలోపు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ పథకంకు గాజులదిన్నెప్రాజక్టు నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసి ఫిల్టర్ నీటిని అందిస్తామన్నారు. గ్రామ సభల ద్వారా సీసీరోడ్డులు, డ్రైనేజీ, వీధిదీపాలసమస్య తాగునీటి సమస్య తీరనుందాన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు గాను ప్రభుత్వం ఈ గ్రామ సభలు ఏర్పాటు చేసిందని ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, పలు శాఖ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం ...

పత్తికొండ ఆగష్టు, 23: గ్రామాలు అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందన్న నినాదం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన గ్రామసభల్లో భాగంగా పత్తికొండ గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభకు ఎమెల్యే కేఈ.శ్యాంబాబుతో పాటు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన వైసీపీ పాలనలో ఎన్నడూ లేనివిధంగా గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. అప్పులు చేసి సర్పంచులుగా గెలిచిన వ్యక్తులు ఆ తరువాత ప్రభుత్వం నుంచి నిధులు రాక మరిన్నీ అప్పులుచేసి గ్రామపంచాయతీ నిర్వహణ చేపట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అధికారంలోకి వచ్చిన టీడీపీ గ్రామపంచాయతీల అభివృద్ధి వైపు దృష్టిసారించి గ్రామాభివృద్ధికి ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ప్రతి పొలనికి నీరు అందించి సస్యశామలం చేయాలన్న సంకల్పంతో స్థానికంగా ఎమ్మెల్యేగా గెలిచిన కేఈ.శ్యాంబాబు సాగునీటి ప్రాజెక్టులవైపై దృష్టిసారిస్తున్నారని, పత్తికొండ నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

● న్యాయాధికారి భారతి



మాట్లాడుతున్న న్యాయాధికారిభారతి

పత్తికొండ టౌన్, ఆగస్టు 23: సెప్టెంబరు 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎంఎస్ భారతి అన్నారు. శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. న్యాయాధికారి మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబరు 14న జరిగే లోక్ అదాలత్‌లో న్యాయవాదులు తమ పరిధిలో ఉన్న రాజీ అయ్యే కేసులను గుర్తించి కక్షిదారులతో మాట్లాడి వీలైనని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే చూడాలని న్యాయవాదులను కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, కోశాధికారి రాజశేఖర్ నాయుడు, సీనియర్ న్యాయవాదులు ఉల్చన్న, సత్యనారాయణ, సురేంద్ర, రాజు, నరసింహయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

తుగ్గలి, ఆగస్టు 23: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో సావిత్రి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జొన్నగిరి ఎంపీయూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన తయారీని ఆమె పరిశీలించారు. ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్లు రవి కుమార్ యాదవ్, లక్ష్మన్న, పులికొండ, జయచంద్ర, అంజి, పుల్లన్న ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న వైద్యులు,నాయకులు

తుగ్గలి, ఆగస్టు 23: కోల్‌కత్తాలో వైద్యసేవలు అందించి విశ్రాంతి తీసుకుంటున్న జూనియర్ డాక్టరుపై అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుజ్జుల లక్ష్మణస్వామి, టీడీపీ నాయకులు వల్లె వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన తుగ్గలి వైద్యశాలలో వైద్యులు ప్రవీణ్ కుమార్, సిబ్బందితో పాటు కూటమి నాయకులు మహిళా డాక్టరును హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నల్లబ్యాడ్జీలు ధరించి ఆసుపత్రి ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సురేంద్ర, కృష్ణయ్య, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: కోల్‌కత్తాలోని ఆర్జీకర్ వైద్యవిద్యార్థినిపై జరిగిన అత్యాచారం హత్య ఘటనపై సెయింట్‌జాన్స్ కాలేజ్ యాజమాన్యం, విద్యార్థుల ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సౌజన్య, పీడీ నరసింహులు, సువర్ణ, దానమ్మ, కూమారి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయి

మద్దికెర, ఆగస్టు 23 : విద్యార్థులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయనీ ఎస్ఐ విజయకుమార్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, హెచ్ఎం అజయ్ బాబు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీబీకే మృతి

దేవనకొండ, ఆగస్టు 23 : గుండ్లకొండ గ్రామ వెలుగుబుక్‌కీపర్ ఈ.రంగస్వామిగౌడ్ (46) గురువారం మృతి చెందారు. గత 20 ఏళ్లుగా బుక్‌కీపర్‌గా విధులు నిర్వహిస్తున్న రంగస్వామి గురువారం తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో, కుటుంబసభ్యులు కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అంత్యక్రియల కోసం తోటి ఉద్యోగులు రూ.5 వేలు, వెలుగు కార్యాలయ సిబ్బంది రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ఏపీఎం రమేష్,సీసీలు కుటుంబ సభ్యులకు అందజేశారు.

సీసీ రోడ్లు నిర్మించాలి

పత్తికొండ టౌన్, ఆగస్టు 23: పట్టణ శివారు కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహేబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కోరారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన గ్రామసభకు హాజరైన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు సీపీఐ బృందం నాయకులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనజీలు, తాగునీటి కొళాయిలు, ఇంటి నెంబర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ తాలుకా అధ్యక్షుడు నెట్టికంటయ్య, సీపీఐ నాయకులు శ్రీనివాసులు, శంకర్, ఓబులేసు, ఆనంద్ పాల్గొన్నారు.

● గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు చక్రాళ్ల వెంకటేశ్వరరెడ్డి, ప్రభాకర్, గోపాల్‌లు కలిసి గ్రామసభలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు వినతి పత్రం అందజేశారు.

అమ్మవారికి ముక్కెర, చంద్రవంకలు విరాళం

మద్దికెర, ఆగస్టు 23 : మండలంలోని పెరవలి గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో వెలసిన రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రముఖ దాత పారా రామచంద్రప్రసాద్, పారా విశ్వనాథ్ బంధువులైన డా.జయలక్ష్మి, రవీంద్రనాథ్ శుక్రవారం రూ.1లక్ష విలువ చేసే బంగారు ముక్కెర, రెండు చంద్రవంకలు ఆలయ ప్రధాన అర్చకులు రంగస్వామికి అందజేశారు.

తుంగభద్ర జలాలతో గ్రామ దేవతలకు అభిషేకం



తుంగభద్ర జలాలను తీసుకెళ్తున్న దోగాలగల్లు గ్రామస్థులు

మంత్రాలయం, ఆగస్టు 23: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం దగ్గర ప్రవహిస్తున్న తుంగభద్ర నది జలాలను ఆస్పరి మండలంలో దోగలగల్లు గ్రామస్థులు తీసుకెళ్లి గ్రామ దేవతలకు అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ భక్తులు పేర్కొన్నారు. శుక్రవారం దాదాపు 50 మంది దాకా బిందెలు, మారణాయుధాలు, జెండాలు, టప్పెట్లు, డ్రమ్స్‌తో పాదయాత్రగా వచ్చి తుంగభద్ర జలాలను బిందెలో నింపుకుని రాఘవేంద్రస్వామికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

చీటిల పేరుతో టోకరా

ఆదోని, ఆగస్టు 23: ఆదోని 3వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చీటిల వ్యాపారం పేరుతో ప్రజలను మోసం చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రామలింగప్ప తెలిపారు. ఆదోని పట్టణానికి చెందిన ప్రీతీసింగ్, ఆమె తండ్రి నారాయణసింగ్, తల్లి పద్మాబాయి ప్రైవేటు చీటీల వ్యాపారం నిర్వహిస్తున్నారు. గతంలో చీటిలు వేసిన వాళ్లకు సకాలంలో చీటి మొత్తాన్ని అందించేవారు. నమ్మకం కుదరడంతో కాలనీవాసులు పెద్ద మొత్తంలో చీటిలు వేసేందుకు ముందుకు వచ్చారు. ఇదే అదునుగా భావించిన వారు ప్రజల నుంచి అధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపించి సుమారు రూ.25లక్షలు వసూళ్లు చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని సీఐ తెలిపారు. చీటి ఎత్తిన వాళ్లు డబ్బులు అడిగితే సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని, గట్టిగా నిలదీసి అడిగితే సుధారాణి అనే మహిళపై చేయి చేసుకున్నారని వాపోయారు. సుధారాణితో పాటు మరో 15 మంది బాధితులు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సుధారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై ఏపీ చిట్ ఫండ్ యాక్టు కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి



పూజలు చేస్తున్న నాయకులు

కోసిగి, ఆగస్టు 23: దేవాలయాల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రాలయం టీడీపీ నాయకుడు రాఘవేంద్రరెడ్డి, మంత్రాలయం జనసేన పార్టీ ఇన్‌చార్జి వాల్మీకి లక్ష్మన్న అన్నారు. శుక్రవారం కడిదొడ్డి గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, నూతన ఆలయ ప్రారంభోత్సవంలో వారు పాల్గొన్నారు. వారికి గ్రామ టీడీపీ నాయకులు వీరమ్మ, తదితరులు పూలమాలలు వేసి సన్మానించారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

ఆలూరు రూరల్, ఆగస్టు 23: ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ సిద్ద లింగ మూర్తి అన్నారు. శుక్రవారం హౌసింగ్ కార్యాలయం నందు ఇళ్ల నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ నాటికి లక్ష 25 వేలు లక్ష ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని, ఆ దిశగా ఇళ్ల నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆదోని ఈఈ ప్రభాకర్, డీఈ ఆదినారాయణ, ఏఈ జాఫర్, ఏపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉరుకుందలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

ఆదోని టౌన్, ఆగస్టు 23: ఉరుకుంద పుణ్యక్షేత్రానికి దైవదర్శనం కోసం తరలివచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని వీరశైవ జంగమ హక్కుల పోరాట సమితి నాయకులు కన్నె జగదీష్, ఆనంద స్వామి, గాజుల చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ నాలుగో సోమవారం భక్తుల తాకిడి అధికంగా ఉంటుందన్నారు. తలనీలాలు సమర్పించే ప్రాంతంలో, ఆలయంలో టెంకాయిలు సమర్పించుకునే చోట భక్తుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నారని, అలాంటి వారిపై ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా చూస్తాం



సర్వే చేస్తున్న రైల్వే అధికారులు

మద్దికెర, ఆగస్టు 23 : మద్దికెర గ్రామంలోని మల్లప్పగేటు సమీపాన గల అండర్ డ్రైనేజీ బ్రిడ్జి కింద వర్షం నీరు నిల్వ లేకుండా రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని రైల్వే పీడబ్ల్యుయూ అధికారి భరత్, ఐవోడబ్ల్యు మధుబాబు అన్నారు. శుక్రవారం రైల్వే అండర్‌బ్రిడ్జిని పరిశీలించారు. వారు మాట్లాడుతూ అండర్ రైల్వే బ్రిడ్జి మరమ్మతులు పనులు కూడా చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళనలు చెందవద్దన్నారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో డైరెక్టర్ రాజు యాదవ్ తదితరులు ఉన్నారు.

ఆదోనివాసికి జ్యోతిష్య శాస్త్రంలో డాక్టరేట్



డాక్టరేట్ పట్టాతో దత్తాత్రేయ శర్మ

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 23: ఆదోని పట్టణం ప్రముఖ వేద పండితుడు గరుడాద్రి దత్తాత్రేయ శర్మ జ్యోతిష్య శాస్త్రంలో డాక్టరేట్‌ను అందుకున్నారు. శుక్రవారం రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్ మహర్షి కాలేజ్ ఆఫ్ వేదిక్ ఆస్ట్రాలజీ యూనివర్సిటీలో జరిగిన డాక్టరేట్ ప్రధానోత్సవంలో వైస్ చాన్సలర్ చావ్లా, ప్రొఫెసర్ రుద్రమణి చేతుల మీదుగా వాచస్పతి బిరుదు ప్రధాన పత్రాన్ని సర్టిఫికెట్‌ను ఆయన అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ 2024 ఏడాదికి సబంధించి జ్యోతిష్యం వాస్తు శాస్త్రాలలో పరిశోధన చేసినటువంటి దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన 294 మంది పరిశోధకులకు డాక్టరేట్ పట్టాను అందుకోవడం జరిగిందన్నారు. తాను కూడా జ్యోతిష్య వాస్త్రంలో కాలసర్ప దోషం ప్రభావాలు అనే అంశంపై పరిశోధన చేయడంతో డాక్టరేట్ పట్టా లభించిందన్నారు. గతంలోనూ తాను గ్రహాలు వ్యక్తిగత-ప్రభావాలు అనే అంశంపై పరిశోధన చేశానన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

ఆస్పరి, ఆగస్టు 23: మండలంలోని డీ కోటకొండ గ్రామ టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ జె వీరభద్రయ్య (64) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. వీరభద్రయ్య మృతి పట్ల టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్, మాజీ మండల కన్వీనర్‌లు ఎస్ తిమ్మన్న దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలు

పెద్దకడుబూరు , ఆగస్టు23: హనుమాపురం గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పరమానంద అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పరమాందన ద్విచక్రవాహనంపై పెద్దకడబూరు నుంచి ఎమ్మిగనూరు వైపు వెళ్తుండగా కర్ణాటకకు చెందిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పరమానందకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ధన గంగమ్మ అవ్వ పరువు



బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న గ్రామ ప్రజలు

ఆస్పరి, ఆగస్టు 23: మండలంలోని కల్లపరి గ్రామంలో వెలసిన ధన గంగమ్మ అవ్వకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనవాయితీగా వస్తున్న దొడగుండ గ్రామం నుంచి ఊరేగింపుగా వచ్చి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీ కిష్టప్ప, పెద్ద సుంకన్న, పెద్ద సెకన్న, బుడ్డన్న గోవిందు, పూజారి గిడ్డయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

బంగారమ్మ దేవికి విశేష పూజలు

ఆలూరు రూరల్: అరికేర గ్రామంలో వెలసిన బంగారమ్మ దేవి ఆలయం నందు శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని భక్తులు ఓక రోజు భజన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో చేశారు. ఉదయం అమ్మవారికి ఆకుపూజ, కుంకుమ అర్చన, పంచామృతశేకం, మహా మంగళహరతి వంటి విశేష పూజలను నిర్వహించారు.

పత్తికొండ డిపోను అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే



బస్సు నడుపుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, ఆగస్టు, 23: కాంగ్రెస్ హయాంలో నష్టాల పేరుతో మూతపడ్డ పత్తికొండ ఆర్టీసీ డిపోను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కేఈ.శ్యాంబాబు అన్నారు. డిపోకు మంజూరైన నూతన బస్సును రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. డిపో నుంచి బైపాస్ మీదుగా తిరిగి డిపోకు బస్సును నడిపారు. కొత్తగా 4 బస్సులు డిపోకు మంజూరయ్యాయని, భవిష్యత్తులో డిపోకుమరిన్నీ బస్సులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

కర్నూలు ఆర్డీవో విచారణ

వెల్దుర్తి, ఆగష్టు, 23: వెల్దుర్తి పట్టణంలో శుక్రవారం కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి ఆకస్మికంగా పర్యటించారు. వలియదాసరికి చెందిన 48 కుటుంబాలు కుల ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవడంతో ఆర్డీవో శేషిరెడ్డి వారి ఇళ్ల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. వృత్తి, గతంలో అందించిన కుల ధృవీకరణ పత్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల చదువుల కోసం కులధృవీకరణ పత్రానికి అవస్థలు పడుతున్నామని ఆర్డీవోకు తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర వర్మ, వీఆర్‌వో ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

కోసిగి ఎస్ఐగా చంద్రమోహన్

కోసిగి, ఆగస్టు 23: కోసిగి ఎస్ఐగా పి.చంద్రమోహన్ శుక్రవారం రాత్రి కోసిగి పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లా రాచర్ల పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై కోసిగి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయినట్లు ఆయన తెలిపారు.

సమస్యలను పరిష్కరించండి

ఆదోని, ఆగస్టు 23: ప్రభుత్వ వసతి గృహంలో ఉన్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని ఏవో ఇన్‌చార్జీ సాయి వినిత్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదోని డివిజన్ అధ్యక్షుడు బాలకృష్ణ, సమాయ కార్యదర్శి చంద్ర, శరత్, చిగిలి నవీన్, గోవర్ధన్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలి

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 23: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ అన్నారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ అధ్వర్యంలో తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటితే అవి మనల్ని సంరక్షిస్తాయన్నారు. మొక్కల నుండి మనుషులు ఎన్నో విషయాలు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎర్రిస్వామి, ఎన్ఎస్ఎష్ ఆఫీసర్ జోనాథన్ వెంకటరామిరెడ్డి, ఉమాదేవి, రామ్మూర్తి పాల్గొన్నారు.

అదానీ మెగా కుంభకోణంపై దర్యాప్తు జరపాలి

ఎమ్మిగనూరు రూరల్ , ఆగస్టు 23: అదానీ మెగా కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాశింవలి, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి సోమప్ప సర్కిల్‌లో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ ఆదాని మెగా కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరపాలని, సెబీ చీఫ్ రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో జైపాల్, లోకేష్, రఫిక్, నబి, రసూల్, కుమార్, అజయ్, అక్బర్, ఇబ్రహిం పాల్గొన్నారు.

ఫార్మాకంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్ ,ఆగస్టు 23: అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మాకంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బాలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంతో రియాక్టర్ పేలి 18మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సత్యన్న, ఉరుకుందు, యల్లప్ప, ప్రసంగి, రాఘవేంద్ర, బుడ్డప్ప, దుర్గప్పలు పాల్గొన్నారు.

మాధవరం ఎస్ఐగా విజయకుమార్

మంత్రాలయం, ఆగస్టు 23: మంత్రాలయం మండలంలోని మాధవరం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా విజయకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎస్ఐ కృష్ణమూర్తి తుగ్గలికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో విజయకుమార్‌ను బదిలీ చేశారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ రామాంజులును మర్యాదపూర్వకంగా కలిశారు.

శివారు ప్రాంతాలను పట్టించుకోవడం లేదు..

ఎమ్మిగనూరు రూరల్ , ఆగస్టు23: ఎమ్మిగనూరు పట్టణంలోని శివారుప్రాంతాల అభివృద్ధిని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పట్టించుకోవడంలేదని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సహాయ కార్యదర్శి సమీఉల్లా, మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఈరమ్మలు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 32వ వార్డులోని గొట్టల బీడ్ మక్కామసీదు సమీపంలోని సంజీవయ్యనగర్‌లో వారు పర్యటించారు. వారు మాట్లాడుతూ కాలనీలో సీసీ రోడ్డు లేకపోవడంతో వర్షం నీరు ఇళ్లమధ్యనే నిల్వ ఉంటుందన్నారు. మురుగు వల్ల ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య సంఘం నాయకురాలు శారద, భాను, లింగమ్మ, నాగవేణమ్మ, సీపీఐ నాయకులు మల్లికార్జునగౌడు, గోపాల్, రాము, కాలనీవాసులు పాల్గొన్నారు.

రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి

హాలహర్వి, ఆగస్టు 23: వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే విరుపాక్షి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన చింతకుంట, మెదాహల్ గ్రామాల్లో పత్తి, మిరప, వరి పంటలను ఆయన పరిశీలించారు. నేషనల్ హైవే రోడ్డు పూర్తిగా కోసుకుపోవడంతో బళ్లారి వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయని ఆగ్రామస్థులు ఫిర్యాదు చేశారు. వెంటనే కొట్టుకుపోయిన వంతెనను పరిశీలించారు.